


చిన్న అడవి. మధ్య సన్నగా వంకర టింకరగా కన్పిస్తున్న కాలిబాట! అక్కడ నన్ను ఒంటరిగా వదలి, బస్సు తనదారిన తాను వెళ్ళిపోయింది. చుట్టూ చూచాను. బాగా ఏపుగా పెరిగిన ముళ్ళ చెట్లు, వేప, మర్రి, నిమ్మచెట్లు ... వాటి నిండా అల్లుకుని విరగబూసివున్న ఏవో అడవిపూల తీగెలు.

సంధ్యచీకట్లు మెల్లిగా నలువేపులా పరుచుకుంటున్నాయి. చీకట్లో నిర్మా

నుష్యంగా గుబురుగా,భీతావహంగావున్న అడవిలోనుంచి కీచురాళ్ళ సంగీతం ప్రారంభమై శరీరాన్ని జలదరింప జేస్తోంది.

ఎక్కడా బండికాదుకదా, దాని గానుల గుర్తుకూడా కన్పించటంలేదు! వారం రోజులక్రితం, నేను ఇక్కడికి వస్తున్నట్లు ఉత్తరంకూడా వ్రాశాను మా శేఖర్‌కు! అది చేరలేదేమో! చాలామార్లు స్వానుభవంలో బంధువుల, స్నేహితుల దగ్గర్నుంచి వారు వస్తున్నట్లు వ్రాసిన ఉత్తరాలు, వారు వచ్చివెళ్ళిన మర్నాడు చేరడం నాకు కొత్తకాదు! అలాగే నా ఉత్తరమూ శేఖర్‌కు చేరివుండదు, లేకుంటే, ప్రాణస్నేహితుణ్ణి, ఈ కారడవిలో "నీ ఖర్మకు నువ్వేరా" అని వదిలేరకంగాదు మా శేఖర్! భారత దేశంలో మరెక్కడా తనకు చోటు లేనట్లు, ఎమ్. ఎస్‌సి. పూర్తిచేసి, ఈ అడవి అవతల ఏ వాహనసౌకర్యమూ లేని ద్వీపంలాటి ఒక గ్రామంలో పాదుకు పోయాడు. ఆమాటంటే, శేఖర్ జవాబిది.

"'జననీ జన్మభూమిశ్చ'...అన్నారు; పుట్టినవూరు, స్వంత వ్యవసాయం వదులుక, ఎక్కడికో పరుగుతీసి, అక్కడేదో సుఖమూ, సంతృప్తీ వుందని వూహించుకోవటం నావల్ల కాదురాగోపీ!" అనేస్తాడు గుక్కతిప్పుకోకుండా!

అంతవరకూ బాగానేవుంది! కానీ ఇలా ఎప్పుడో, ఎలాగో, ఉద్యోగపు బాధ్యతలనుంచీ, ఆఫీసరుగారి కబంధ హస్తాలనుంచీ, ఆయన సునిశిత తీక్ష్ణ వీక్షణాలనుంచీ బయటపడి, శ్రీమతికి నాలుగురోజుల్లో తప్పక తిరిగివస్తానని వాగ్దానంచేసి, మరీ బయల్దేరి, చిన్ననాటి చెలికాణ్ణి చూడాలనే తీవ్రవాంఛతో పరుగెత్తుకువచ్చే నాలాటి బస్తీ "గోపీ కృష్ణ"లకు మాత్రం ఇలా దారీ తెన్నూ లేని మూరుమూల గ్రామం కనుక్కోవటం అగ్నిపరీక్షే! అందుకే ముందు జాగ్రత్తపడి మా శేఖర్‌కు నారాక తెలియ పరచాను కార్డుద్వారా. వాడు తన స్వంత పెద్దఎద్దులనూ, బండినీ తీసుకుని, ఆతురతగా నాకోసం వేచివుంటాడనికూడా, బస్సులో వస్తూ ఎన్నోన్నో తియ్యని వూహలు వూహించాను కూడా! కానీ శేఖర్ రాలేదు... బండీలేదు... కనీసం వాడి తరపు మనిషికూడా లేడు.

చూస్తుండగానే చీకటి మరింత దట్టమై పోయింది. ఇలా ఆలోచిస్తూ కూర్చోవటం సబబుగాదనిపించి బేగ్ తీసుకుని నడక ప్రారంభించాను! మిట్టపల్లాలుగావున్న బాట, కళ్ళకు తగిలేలా బాట మీదకు వంగివున్న కంపచెట్లు చెంపలకు గీరుకుపోకుండా జాగ్రత్త పడ్తున్నాను. నడక అట్టే అలవాటులేని నాకు ఆయాసం వస్తోంది. ఆగి మరొక్కసారి చుట్టూ కలయజూచాను. ఇంకా గమ్యం షుమారు ఒకటిన్నరమైలు వుండొచ్చునేమో ననిపించింది! కాలేజిలో చదివేటప్పుడు

కలవుల కోసారి శేఖర్, తనతోకూడా పిల్చుకువచ్చా డిక్కడికి!

రక్కున ఆగిపోయాను. బాట రెండుగా చీలి రెండు దార్లు అయ్యింది! ఏ దారిన పోవాలో? ఏ దారంట పోతే ఎక్కడ తేలుతానో ఎవరి కెరుక? కర్తవ్యతా మూఢుణ్ణయి నిల్చుండిపోయాను! తెల్లారే వరకూ ఈ చలిలో చీకట్లో ఇలా నిల బడగలనా? ఏ దారంటో పడిపోతే ఏ వూరో రాకపోతుందా? తిన్నగా ఆరాతీసి శేఖర్ వూరికి వెళ్ళొచ్చు, అంతగా దోవ తప్పితే!

హఠాత్తుగా ఓ ఫర్లాంగు దూరంలో చెట్లచాటునుంచి, ఎవరో లాంతరుతో, బాటమీద వెళ్తుండటం కన్పించింది! భగవాన్ బ్రతికిపోయాను, ఏ రైతు సోద రుడో, ఏ పశువుల కాపరో అయ్యుం టాడు! ఫర్వాలేదు గబగబ నడిచానంటే అతణ్ణి కలుసుకోగలను. నా పరిస్థితులు వివరిస్తే, జాలితలచి, దోవ చెప్పి, ఊరు చూపించక పోడు...

నడక వేగం హెచ్చించాను. కానీ ఎంత వేగంగా నడిచినా, నాముందున్న దీపంవ్యక్తిని కలుసుకోలేకుండా వున్నాను...అతగా డెవరోగానీ, వాయు వేగ మనో వేగాలతో పరుగెడ్తున్న ట్లున్నాడు. నాకు ఆయాసం వస్తోంది కానీ అతణ్ణి అందుకోలేక పోతున్నాను. మధ్యమధ్య అతడి దీపం పైకీ కిందికీ ఊగుతూ ఆరిపోబోయెంతలో తిరిగి వెలుగుతున్నది! బహుశా అంతతీవ్రంగా, వడిగా నడుస్తున్నాడు కాబోలు! మా ఇద్దరిమధ్యా దూరము ఏ మాత్రమూ తరగటం లేదు. పోనీ కేక వేస్తే? ఏమని? 'అబ్బీ!' అంటే ఏమనుకుం టాడో? 'అబ్బాయ్' అంటే? ఆ వ్యక్తి అబ్బాయో, అమ్మాయో నాకేం తెలుసు? ఛ...ఛ...పిచ్చి వూహ; ఈ అపరాత్రి వేళ యీ నిర్జనారణ్య ప్రాంతంలో అమ్మాయి ఎలా వుంటుంది?

రివ్వుమని చలిగాలికూడా వీస్తోంది. ఇక తాత్సారం చేస్తే లాభంలేదు. ఆ దీపం మినుకు మినుకు మంటోంది కూడా..."ఏమండోయ్ ఎవరా వెళ్లేది! కాస్త నిలబడండి బాబూ!"

నా కంఠం ఎంతవరకూ హెచ్చు స్థాయికి వెళ్ళగలదో, అంత పెద్దగానూ అరచి గొంతు నిమురుకున్నాను!

సరిగ్గా నా పిలుపు ఓ మైలుదూరం సులభంగా విన్పించవచ్చు, నిశ్శబ్ద నిశా సమయంలో! కానీ ఆ వెళ్ళే వ్యక్తికి బ్రహ్మచెముడో, తలపొగురో నాకైతే తెలియదుగానీ, మరికాస్త జోరుగా లాంతరు వూగిస్తూ వెళ్తున్నాడు!

ఆ దీపంవ్యక్తి ధర్మమా అని, నేనతణ్ణి కలుసుకోవాలనే తాపత్రయంతో, ఆయా సము మరచి త్వరత్వరగా నడిచాను.

అదిగో తెల్లగా కన్పిస్తున్న పెద్ద సున్నపు బట్టీ! ఇదే సరియైన త్రోవ! నా కీ సున్నపుబట్టీ బాగా గుర్తే. ఎలా

ఐతేనేం, త్రోవ తప్పలేదు! అంతేచాలు.

ఆ దీపంవ్యక్తి గబగబా సున్నపు బట్టీని సమీపించి, చుట్టూరా తిరుగుతూ హఠాత్తుగా బట్టీపైకి ఎక్కి తిరుగుతున్నాడు. కానీ నేను సమీపిస్తున్నకొద్దీ ఆ వెలుగు దీపంలా కాక, కాగడలా మండుతున్న ట్లనిపిస్తోంది! విస్మయంతో మరింత దగ్గరగా వచ్చాను... బట్టీమీద వున్న వెలుగు హఠాత్తుగా తిరిగి నా కుడి చేతివేపు అరఫర్లాంగు దూరంలో చెట్ల మధ్యకు వెళ్ళి మాయమయ్యింది.

ఏదో అనుమానం హృదయమంతా అలుముకుం దొక్కసారిగా? ఆ వెలుగేమిటి? మనిషా? కాదా?

ఛ...ఛ...ఇంత చదువుకున్న నేను, విజ్ఞానశాస్త్రంలో పరిశోధనలు జరుపుతున్న నేను మూఢత్వాన్ని ఆశ్రయించటమా? ఎమ్. ఎస్సి. చదువుతున్న రోజులలో, క్లాస్‌మేట్సు అంతా పిక్నిక్‌కని వెళ్లాం. గత స్మృతి వడివడిగా దృశ్యమై నా ముందు నిలిచింది క్షణంలో!

*　　*　　*

మేం తీసుకున్న బంగళాకు కొద్ది దూరంలోనే స్మశానం! అక్కడ వున్న వారం రోజుల్లోనూ షుమారు పది శవాలనైనా తగలబెట్టడం కళ్లారా చూశాము. దానికితోడు శర్మకూ, వేణుకూ అస్తమానూ హత్యలూ, శవాలూ, దయ్యాలను గురించి కబుర్లే తప్ప మరొకటి నోటంట రావటంలేదు.

లేడీ స్టూడెంట్సులో విమల, మీనాక్షి, శకుంతల, కామేశ్వరి మాత్రం ఎలాగో పళ్ళభీకరానికి భయం లేనట్లు, నటించారు... కానీ వాళ్ళ చూపుల్లో కన్పిస్తున్న భీతి నాకూ తెలుసు! శర్మా, వేణూకూడా ఇది పసికట్టారు. లలిత మాత్రం వినివిని హడలిపోయింది.

"మిస్టర్ శర్మా, నీ కో నమస్కారం పెడతానయ్యా! ఆ వెధవ దయ్యాల కబుర్లు ఆపు. అసలే ఎదురుగా శ్మశానం! పూట కో శవం తగలడుతోంది. దానికి తోడు ఈ వెధవపురాణాలు."


అంటూ దూరంగా పోయి కూర్చుంది. కానీ ఆవిడ భయం శర్మనూ, వేణునూ మరింతగా రెచ్చగొట్టింది.

నేనూ, కాంతరావూ, మధూ, శేఖర్, ఎంతవారించినా వినకుండా మరీ ఎక్కువగా సాగించారు దెయ్యాల కబుర్లు.

"పిక్నిక్ సరదా తీరింది నాకు! నేను మాత్రం రేపు వెళ్ళిపోతాను. మిస్టర్ గోపీకృష్ణా, నన్ను రైలెక్కించి ఈ శ్మశానంలో మీరు బ్రతికినంతకాలమూ సరదాగా వుండండి, నా కభ్యంతరం లేదు!" అంది లలిత కళ్ళనీళ్ళు పైకి రాకుండా ఆపుకోడానికి విఫలప్రయత్నం చేస్తూ, నాతో, చుట్టూ ఎవరూ లేకుండా చూసి.

నాకు జాలీ, ప్రేమా ముంచుకొచ్చాయి.

"లలితా! అలా నువ్వు భయపడే కొద్దీ వాళ్ళకు హుషా రొస్తోంది. భయ




పడి పారిపోయావని గేలిచేస్తారు రేపు కాలేజిలో...”

నామాటలు పూర్తి కాకముందే లలిత అరిచింది “చేస్తే చెయ్యనీ! నే నిక్కడో క్షణం వుండలేను గోపీ...!”

అంటూండగా మాకు కొద్దిదూరంలో హటాత్తుగా చిన్నమంట కన్పించి అరి పోయింది:

“బాబోయ్! కొరివిదయ్యం!” వెర్రికేక పెట్టి నన్ను గట్టిగా తనచేతులతో చుట్టివేసి, స్పృహ తప్పిపోయింది లలిత అల్లాగే.

మెల్లిగా వడిలోకి చేర్చుకుని తల నిమురుతూ కూర్చున్నాను. భయంతో అలా లలిత నన్ను హటాత్తుగా పెన వేసుకుపోవటంతో, నా హృదయ వీణ శృతి చేసి మీటిన ట్టయ్యింది! అందాకా హృదయంలో దాగివున్న అనురాగం ఉప్పొంగిం దొక్కసారిగా!

“వహ్వా! వండ్రఫుల్ యాక్షన్! లౌసీన్ – మీ యిద్దరిలా మరెవ్వరూ నటించలేనంత చక్కటిపోజ్ వేసారు! ఏదిరా కెమేరా, మధూ!”

కాంతారావు మాటలు విని వులికిపడి

చూచాను. చుట్టూ అంతా విరగబడి నవ్వుతూ నిల్చునివున్నారు! సిగ్గుతో కుంచించుకుపోయాను; కానీ అంత వరకూ వచ్చాక, తడబడిపోవటం హాస్యాస్పదం!

"నోళ్ళు మూసుకోండిరా! అసలే బెదిరిపోయిందేమో, వెర్రి కేక పెట్టి స్పృహతప్పిపోయింది లలిత!"

సంక్షిప్తంగా జరిగింది వివరించాను..

"స్పృహలేదా?" నివ్వెరపోతూ, దగ్గరగా వచ్చి నిజమేనని తేల్చుకుని, సాయంపట్టారు మీనాక్షీ, శకుంతలా!

శర్మ, వేణు చాలా నొచ్చుకున్నారు!

అరగంట తర్వాత లలిత కళ్ళు తెరిచింది! కానీ ఆ చక్కటి కళ్ళలో ఇంకా భీతి గూడుకట్టుకునేవుంది. పక్కనే కూర్చునివున్న నా చెయ్యి అలాగే నొక్కిపెట్టు 'కొరివిదయ్యం..' అంది అస్పష్టంగా.

"కొరువుల్లేవూ! దయ్యాలూలేవు!"

"మరదేమిటి?" అలాగే హీన స్వరంతో అడిగింది.

"ఇంత చదువుకున్నావ్, ఆ మాత్రం తెలీదు?"

"ఇది స్మశానం! శవాలు కాలిపోయిం తరువాత ఎముకలు నేలలో వుండి పోతాయా? అవి కొంత కాలానికి సున్నపు పొడి (కాల్షియంగా) మారి భూమిలో కలిసిపోతాయి! గాలిలోని తేమ, భాస్వరం, కాల్షియం ఇవన్నీ కలిసి, భూమి లోని నెర్రలు (బీటలు) ద్వారా, మండి ఆరిపోతుంది! ముఖ్యంగా స్మశాన ప్రదేశాలలో అలా తరచూ జరుగుతూంటుంది. దాన్నే 'కొరివిదయ్యా'లని నిర్వచించారు కొందరు ప్రబుద్ధులు!"

నమ్మలేనట్లు చూచింది లలిత!.

"నిజం! లలితా!"

ఆనాటి మా ఇద్దరి అనుభవాన్ని పురస్కరించుకుని మధు 'కొరివిదయ్యం' అనే హాస్యపూరితనవలిక వ్రాసి ప్రచురించాడు. అంతటితో ఆగక అదే పుస్తకాన్ని మా వివాహ సందర్భంలో, వధువు లలితకు, పెళ్ళి కానుకగా ఇచ్చాడు!

'లలితా అదో కొరివిదయ్యం!' అంటాను ఎప్పుడేనా హాస్యానికి దూరంగా గుంపుగా ఎగురుతూండే మిణుగురు పురుగులను చూపిస్తూ; దాదాపు లలిత మీద వరిగిపోతూ!

'చాల్లెండి వేళాకోళం!' లలిత సుతారంగా కోప్పడుతుంది!

'ఏమయితే నేం? ఆ కొరవి దయ్యానికి నా ధన్యవాదాలు! మనల్నిద్దర్నీ భార్యాభర్తల్ని చేసేసింది! ఆనాడు నువ్వలా నన్ను పెనవేసుకోకపోతే...'

'ఇక ఆపుతారా లేదా?' లలిత చిరుకోపం నాకు గిలిగింతలు పెట్టేస్తుంది!

'గు...గ్గూ ... గ్గూ ... గుగ్గూ ... గ్గూ...'

ఏదో పక్షి ఎలుగెత్తి అరుస్తోంది! గత స్మృతులు తెరమరుగయ్యాయి!

ఎదురుగా చిన్నచిన్న వూరిళ్ళు కన్పిస్తున్నాయి!

ఆ వెలుగును గురించి ఆలోచిస్తూ నేనింతదూరం వచ్చేశా నన్నమాట! ఆనాడు లలితను సమాధాన పరచగలిగాను...కానీ ఈరో జెందుకో ఆనాటి నా సమాధానాన్ని నా అనుభవంతో అన్వయింపజేసుకోలేక పోతున్నాను...,

ఓహ్! ఈ చిన్నసంఘటనను గురించి ఇంత ఆలోచ నేమిటి? గబగబ నడిచాను...శేఖర్ నిద్రలో వులికిపడి లేచి అమాంతం నన్ను పట్టుకు కుదిపేశాడు.

"ఏమిటో ఈ ఆగడం గోపీ? జాబు వ్రాస్తే, నేను బండికట్టుక, సపరివారంగా నీకు ఎదురొచ్చి, సగౌరవంగా తీసుకు వచ్చేవాణ్ణి కదూ? ఈ చీకట్లో, చలిలో దో వెలా కనుక్కున్నావ్? భయం వెయ్యలేదూ? కాళ్ళు నొప్పెట్టలేదూ?" శేఖర్ మాటల్లో స్నేహామృతఝురి వెల్లువలై ప్రవహిస్తోంది! జాబు వ్రాసిన వైనం చెప్పాను!

"ఆఁ వ్రాశావా?'' క్షణకాలం నివ్వెరపోయి, పోస్టల్ డిపార్టుమెంటునంతా ఓ ఐదునిముషాలు విమర్శించి, మరీ నొచ్చుకున్నాడు శేఖర్!

"వసంతా! మా గోపీ నాకోసం ఎలా వెతుక్కుంటూ వచ్చాడో చూశావా? పాపం అన్నంకూడా తినలేదు రాత్రి! పద! త్వరగా వెళ్ళి భోజనం ఏర్పాటు చెయ్యి!'' అన్నాడు శేఖర్, తన భార్యకు నన్ను పరిచయం చేస్తూ...

"ఒద్దురా! ఇప్పు డేం ఆకలిగా లేదు," అన్నాను ఆవిడ నా అర్ధరాత్రి ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక!

"కోతలు కట్టిపెట్టరా! సాయంత్రం అనగా బస్సు దిగి, అలవాటులేని నడక నాలుగుమైళ్ళు నడిచి, ఇంకా ఆకలి లేదంటే నమ్మటానికి, 'కాళియంలోని భాస్వరం, గాలిలోని తేమ కలిసి మంట తయారయ్యింది గానీ, అది కొరివి దయ్యం కాదని చెబితే, నమ్మిన అమాయకురాలు లలిత అనుకున్నావా?''

త్రోవలో చూచిన తమాషా చెప్పాలనిపించింది. కానీ లోపల్నుంచి అప్పుడే భోజనానికి పిలుపు వచ్చింది!

## 2

మూడురోజులు సరదాగా గడిచిపోయాయి. తన పొలాలూ, పైర్లూ, పల్లెటూరి విశేషాలూ, వింతలూ అన్నీ, చూపించాడు శేఖర్ నాకు. ప్రశాంతమైన ఈ వాతావరణంలో, సహజమైన ఈ జీవన విధానంలో, ఏదో తెలియని హాయి నిండివుంది.

"రేపు వెళ్ళిపోతాను శేఖర్! మరి కాదనకు!'' అన్నాను ఆరోజుసాయంత్రం!

"అదేమిట్రోయ్! వారం రోజు లేనా...?"

''మా భర్తగారి అనుమతి లేదు

ఒకటి...... రెండోది మా శ్రీమతి నిరీక్షణ !"

"మీ భర్తగా రంతటి దుర్మార్గుడా?"

అందరు పెద్ద ఆఫీసర్లలానే అతగాడి కూడా తనకింద వున్న మాబోటి వాళ్ళను కాస్త కరినంగా చూడటం సరదా.

"ఉద్యోగ ధర్మంలో పతివ్రతవై పోయా వన్నమాట."

"బ్రతుకుతెరువుకోసం అలా నటించక తప్పటంలేదు మరి."

"బావుంది, ఇక రెండో కారణం విన్నతరువాత మరి 'వుండమని' నీకు చెప్పకుండా నోరు కట్టుపడిపోయింది. సరే, ఈ రోజలా వెళ్ళొద్దాం రా. చక్కటి తమాషా చూపిస్తాను..."

శేఖర్, పక్కగ నేనూ నడుస్తున్నాం. నాలుగు రోజుల క్రితం నేను నడచి వచ్చిన త్రోవలోనే నడుస్తున్నాం... కొద్దిదూరంలో సున్నపుబట్టీ కన్పిస్తోంది. "ఇది వూరి పొలిమేర" అన్నాడు శేఖర్.

"ఒరే శేఖర్, అదుగో బట్టీ! ఈ దారంటే నేను నడచివచ్చాను... ఓ తమాషా చూచాను... చెబుదామనుకుంటూనే మర్చిపోయాను..." అన్నాడు ఉపోద్ఘాతంగా.

"అడవిలోనుంచి వెలుగు ఈ బట్టీ వరకూ వచ్చింది కదూ ?" అన్నాడు శేఖర్ పెద్ద జ్యోతిష్కునిలా.

"అరె! నీ కెలా తెలుసు. దోవ తెల్సుకుందామని గొంతు చించుకొని అరిచాను...చివర కిదమిద్ధమని తేల్చుకో లేక పోయాను..."

"అదే సంగతి చెబుదా మనీ, నీకు చూపిద్దా మనీ పిల్చుకొచ్చాను. అదో, ఆ మర్రిచెట్టుకింద కూర్చుందాం పద," అన్నాడు శేఖర్.

సున్నపు బట్టీకి దాదాపు ఇరవై గజాల దూరంలో పెద్ద మర్రిచెట్టు క్రింద ఇద్దరం కూర్చున్నాం......క్రమంగా సంధ్యాసమయం దాటి చీకటి మెల్లిగా ఆవరిస్తోంది.

"భయపడవు కదూ ?" అన్నాడు శేఖర్ నా వేపు చూస్తూ.

"భయమా ? నాకా ? మొన్న రాత్రి ఒంటరిగా ఈ అడవిలోనుంచి నడచి వచ్చాను తెలుసా?" అన్నాను ధీమాగా.

"ఏదీ తెలియకముందు ఆ రావటం వేరు. ఫలానా అని తెలిశాక ఝడుసుకోకుండా వుండటం వేరు."

"ఏమి టా ఫలానా ?" అన్నాను.''

''అదుగో అటుచూడు...'' శేఖర్ చెయ్యి చూపినవేపు చూచాను. దూరంగా వున్న చెట్లలోనుంచి, సన్నని వెలుగు... మొన్న రాత్రి నాకన్పించిందే ! సందేహం లేదు; వడివడిగా ఇటే వస్తోంది ! ''పరీక్షగా చూడు !'' అన్నాడు శేఖర్ తిరిగి.

ఈమారు బాగాకనిపిస్తోంది! షుమారు



నేలకు ఏడెనిమిదడుగుల ఎత్తులో, శూన్యంలో, కేవలం కాగడాలాటి మంట మాత్రమే గాలిలో తేలివస్తోంది! "ఇది "కలకాదుగదా ? శేఖర్!" అన్నాడు సన్నగా.

"ఊఁ!"

"ఇది కలకాదుకదా ?"

"గిల్లనా ?"

"కలకాదు!ప్రత్యక్షంగాచూస్తున్నాను! ఆ మంట అలాగే బాగా తేలిపోతూ

గాలికి ఆరిపోతున్నట్లు వెలుగుతూ సున్నపుబట్టీ దగ్గరకు వచ్చింది! ఏమీ లేదు! ఉట్టి వెలుగుమాత్రమే!

"సున్నపుబట్టీ చుట్టూరా రెండుమూడు సార్లు తిరిగింది ... హఠాత్తుగా సున్నపు బట్టీమీద కాస్సేపు వెలిగింది! తిరిగి అడవికేసి తేలుతూ చరచర వెళ్ళిపోతోంది. చూస్తుండగానే మరోసారి వచ్చింది! అలాగే తిరిగివెళ్ళింది! ఏమిటంటావ్ గోపీ?''

శేఖర్ సన్నగా నవ్వుతున్నాడు. ధ్వనిలో హేళన మిళితమైవుంది!

నరాలు బిగుసుకుని వున్న నాకు, శేఖర్ ప్రశ్న మరింత గగుర్పాటును కల్గించింది!

"ఏమిటోరా! అయోమయంగా వుంది!''

''భాస్వరం, గాలిలోనితేమ..కాదా?" శేఖరం ప్రశ్న!

''ఏమో...ఏమో...''

తిరిగీ ఆ వెలుగు బట్టీదగ్గరకొచ్చింది. ఈమారు ఊరివేపు సాగబోయి, బట్టీ దాటి రాబోయింది. కానీ గిరుక్కున విసరినట్లు వెనక్కి వచ్చేసింది మళ్ళీ.

''ఈ వైజ్ఞానిక యుగంలో చాలామంది నీలానే'' ఇలాటి విషయాల్ని తేలికగా తీసుకుంటారురా గోపీ! పల్లెటూరివాళ్ళ మూర్ఖత్వంక్రింద కూడా జమ కడతారు...ఆ మధ్య మావూరికి జమాబందికి తాశిల్దారూ, జనాభాలెఖ్ఖలకని ఓ సెన్సస్ ఆఫీసరూ ఒక్కమారే వచ్చారు. ఊళ్లోజనంవల్ల ఈ కధ విన్నారు:"

* * *

"అంతాగాస్!" అన్నాడు తాశిల్దారు.

"గ్రామప్రజలు అమాయకులనుకుంటాంగానీండి, కొత్త కొత్త ఫార్సులు కల్పించి బస్తీవాళ్ళను బోల్తా కొట్టించటంలో వాళ్ళకు వాళ్ళేసాటి!" అన్నాడు సెన్సెస్ ఆఫీసరు;

"మీ ఉద్దేశమేమిటి?'' అనడిగారుట మా నాన్నగారు:

"నేను నమ్ముతాను!'' అన్నారట ఆయన గంభీరంగా!

విరగబడినవ్వారిద్దరాఫీసర్లూ! ''మీరేదో తెలివిగలవారనుకున్నాం. ఇంతేనా?" అని ధ్వనించిందానవ్వు!

"ఇదెవరో కల్పించి చేస్తున్న తమాషా! అంతా ఒక్క దెబ్బలో విడదీస్తాం ఈ మిష్టరీ!'' అన్నాడు తహశిల్దారు.

వంతపాడాడు సెన్సెస్ ఆఫీసరు!

గ్రామజనమంతా పోగయ్యారా రోజు రాత్రి మర్రిచెట్టుక్రింద. చాలామంది వాదించారు, కానీ బస్తీబాబులు చెవిని పెట్టలేదు; నాన్నగారు తటస్తంగా చూస్తూ వూరుకున్నారు.

చూస్తూండగానే వెలుగుతూ వచ్చేసింది. బట్టీచుట్టూరా తిరిగి, బట్టీమీదకెక్కి తిరిగీ అడవికేసి వెళ్ళింది. తిరిగీ

వచ్చింది. బట్టీమీద నిశ్చలంగా వెలుగుతోంది. అదనుకోసం చూస్తూన్న ఆఫీసర్లిద్దరూ, చెరోగొట్టం నీళ్ళూ చిమ్మారు. అంతే! మంట ఘుప్పుమంది. ఆఫీసర్లిద్దరూ వెర్రికేకలు పెట్టి, బట్టీకిందకి దొర్లిపడ్డారు, అచేతనంగా. రెండు మూడు నిముషాలపాటు మంట వారిమీదనే, వారిని తాకుతూనే తిరిగింది ... తిరిగి, అడవికేసి వెళ్ళింది.

గ్రామస్థుల చేతిచలువతో వారం జురోలకు కాస్త కోలుకున్నారు. కానీ, తాశిల్దారు బస్తీకి వెళ్ళి తీసుకు తీసుకు చచ్చాడు – ఏదో అంతుబట్టని జబ్బుట! ఈనాటికి ఆసెన్సెస్ ఆఫీసరు రాత్రిళ్లు ఉలికి ఉలికి పడ్తున్నాడు..."

శేఖర్ ఆగాడు.

"ఇంతకూ ఏమి టాకథ శేఖర్! నాకంతా చిత్రంగా వుంది?" అన్నాడు.

"పొద్దుపోతోంది! ఇంటి కెళ్దాం పద! రాత్రికంతా వివరంగా చెబుతాను!"

శేఖర్ లేచి నిల్చున్నాడు.

ఆతురత ఎక్కువగా వున్నా, కాదన లేక అనుసరించాను.

*　*　*

## 3

భోజనా లయ్యాక మేడమీదకు పిల్చుకెళ్ళాడు శేఖర్. కాస్సేపట్లో, ఎవరో వృద్ధరైతు మేడమీదకు వచ్చాడు.

"రా! కోటయ్యా కూర్చో!" అన్నాడు శేఖర్.

ఆ కథేదో చెబుతా డనుకుంటున్న నాకా కొత్తవ్యక్తి ఆగమనం చిరాకును కల్గించింది.

"ఎందుకో కబురంపావుట చిన్నబాబూ! పొలంనుంచి రాగానే, మా ఆడోళ్లు చెప్పారు..." అన్నాడు కోటయ్య!

కొద్దికొద్దిగా చలి ప్రారంభము అవుతోంది!

"ఇదుగో ఈయన నాతోపాటు చదువుకున్నాడు. మంచి స్నేహితుడులే! బట్టీదగ్గర వెలుగు చూసి, అదేమిటని ఒకటే అడుగుతున్నాడు! ఆ కథ నీ నోటితోటే చెబుతే బాగుంటుందని, పిలిపించాను...'' అన్నాడు శేఖర్!

"ఈ మనిషికీ ఆ వెలుగుకూ సంబంధమేమిటో?'' అనడగబోయాను.

కానీ శేఖర్ త్రికాలజ్ఞుడిలా నవ్వాడు.

"ఇతగాడు ఆ వెలుగు తోటికోడలి మనవడు."

మరీ ఆశ్చర్యం!

"నువ్వు మొదలెట్టు కోటయ్యా.'' అన్నాడు శేఖర్.

కోటయ్య, నముల్తున్న పొగాకు ఉమ్మివేసివచ్చి, కంబళి మరింత గట్టిగా కప్పుకుంటూ గొంతుసవరించుకున్నాడు. కోటయ్య కథ సాగించాడు ... మన భాషలో ఆ కథ ఇదీ......

*　*　*

తిరుపతయ్య, మంగయ్య అన్న

దమ్ములు - ఆకారంలోనే గాక ఒడ్డూ పొడవులలోకూడా. ఒక్క అచ్చులో నుంచి తీసినట్లుండేవారు. కానీ స్వభావాలలో ఇద్దరికీ ఎక్కడా పోలికలే లేవు. తిరుపతయ్య మాటా, మనసూ, నవ్వూ, కూడా స్వచ్ఛంగా సరళంగా, స్ఫటికంలా వుండేవి.

మంగయ్య మాటకూ మనసుకూ పొందికేలేదు... నవ్వులో ఏదో అర్థం గాని విషపురేఖ సన్నగా పొదసూపుతుంది.

కాని అన్నదమ్ములు ఒకరికొకరు ప్రాణం ఇచ్చుకునేవారు! వున్నకాస్త పొలమూ దున్నుకుని గట్టిగా సంసారం సాగించటంలో 'సెభాష్' అనిపించుకున్నా రిద్దరూ!

తిరుపతయ్య భార్య మహాలక్ష్మి, పేరుకేకాదు, రూపానిక్కూడా లక్ష్మే! మంగయ్య భార్య బంగారమ్మకూడా తక్కువ రూప సేం కాదుగానీ, మహాలక్ష్మితో సరితూగలేకపోయేది పక్కన నిలబెడితే! కుటుంబం పెరుగుతోంది! తిరుపతయ్యకు ముగ్గురు బిడ్డలు కలిగారు. నాలుగోమారు గర్భిణిగా వుంది మహాలక్ష్మి. బంగారమ్మ మొక్కులు ఫలించి, ఆవిడా నవమాసాలతో నిండుగా తిరుగుతోంది ఇంట్లో!

పాడీ పంటా, సిరీ సంపదా వృద్ధి అయ్యింది, సమిష్టికుటుంబం చక్కగా సాగిపోతోంది!

తిరుపతయ్య, మంగయ్య చింతతోపు కొన్నారు.

సున్నపుబట్టీ వేసారు! చుట్టుపక్కల గ్రామాలకంతకూ ఇదేబట్టీ కావటంవల్ల, మంచి గిరాకీ హెచ్చింది!

ఆరోజు...పాపిష్టిరోజు...!

బట్టీనిండా సున్నపురాళ్ళు పేర్చి, క్రింద గూళ్ళల్లో చింతమొద్దులు పేర్చి, నిప్పంటించారు కూలీలు! తిరుపతయ్యకా రోజంతా ఊపిరేసలపలేదు పనితో... ఇంటికి అన్నానికి రావటానిక్కూడా, తీరలేదు. కూలీలంతా ఇళ్ళకెళ్ళారు...

ఒరే మంగా! నిప్పు రేగుతుందేమో, చుట్టూ గుడిసె లున్నాయ్! నే నిక్కడే వుంటాను...ను వెళ్ళి అన్నంతిని, నాకూ ఇక్కడికే తీసుకురా!'' అన్నాడు తిరుపతయ్య, బట్టీ క్కాస్తదూరంలో నులక మంచంమీద కూలబడ్తూ...

మంగయ్య బయల్దేరబోయాడు...

మళ్ళీ తిరుపతయ్య కేం గుబులు దొర్లిందో, "ఉండరా మంగా! నే నట్లా బయలు కెళ్లొస్తాను! అటునుంచటు మన జొన్నచేలో పశువులు ఏవేనా పడుతున్నాయేమో చూసొస్తాను. కాస్త కాళ్ళ తిమ్మిర్లు తగ్గుతాయి. ఆనక నిన్ను పంపిస్తాను..." అన్నాడు లేస్తూ.

మంగయ్య మంచంమీద కూర్చుని అప్పుడప్పుడూ బట్టీ మంటకేసి చూస్తున్నాడు. బట్టీ పైనుంచి సున్నపురాళ్ళు కువకువ ఉడుకుతూ పొడిగా మారు




తున్నాయి. సెగ కొడుతోంది. కాస్త దూరానికి మంచం లాక్కుని కూర్చున్నాడు.

ఇంటిదగ్గర మహాలక్ష్మి, ఉదయం నుంచి భర్త భోజనానికి రాకపోవటంతో ఆరాట పడిపోయింది. గిన్నెలో అన్నం కూరా వేసుకుని, పిల్లలను తోటికోడలి కప్పగించి, బయల్దేరింది.

"ఈ చీకట్లో నువ్వెందుకక్కా ?" అంది బంగారమ్మ.

"పర్వాలేదులే బంగారూ, అన్నదమ్ము లిద్దరికీ పనిబడుంటుంది. నే పోయి, మంగయ్యను పంపిస్తాలే..." అంటూ నడక సాగించింది...

నడుస్తున్న మహాలక్ష్మి హృదయములో కెరటాల్లా ఎన్నో ఆలోచనలు రేగుతున్నాయి. బంగారుకు బంగారం లాటి కొడుకు పుట్టాలి. పాపం, పెళ్ళయ్యాక ఎన్ని సంవత్సరాల తర్వాతో తిన్నగా దాని కడుపు పండింది. వాడికీ తన పెద్ద కొడుక్కిలానే, బంగారు మురుగులు చేయించాలి. తిరుపతి వెంకన్న పేరే తమ ఇంట్లో వాడుక. ఆ పేరే పెట్టాలి. బంగారు, మంగయ్య ఒట్టి అమాయకులు. ఏనాడూ తనను గానీ, అన్ననుకానీ ఎదురించలేదు.

మరో మూడు నెలలకు తనకూ ప్రసవ మౌతుంది. కానీ ఈసారి ఆడ పిల్ల పుట్టాలి; ముగ్గురు కొడుకులున్నారు చాలు. ఆడపిల్లలేకుంటే ఇంటి కళే ఉండదట.

బట్టీ భగభగ మండటం అల్లంత దూరాన్నుంచే కన్పిస్తోంది మహాలక్ష్మికి. అడుగులు గబగబ వేస్తోంది. మంచం మీద కంబళి కప్పుకు కూర్చుని వున్న మంగయ్య దూరాన్నుంచే వచ్చే మనిషిని పోల్చుకున్నాడు...క్షణంలో అతని హృదయంలో ఏదో పైశాచిక భావం కదలాడి, అది ఇంతయి, అంతయి, భరించలేనంత దుర్భరమై కూర్చుంది. ఎన్నాళ్ళగానో అణచిపెట్టిన కోర్కెలు ఒక్కసారిగా బయటికి వచ్చాయి.

"అన్న వస్తే?" అన్న ఆలోచనకు మనస్సులో సమాధానం చెప్పుకున్నాడు.

"అతగాడు సిగ్గుగల మగవాడు... అరమైలు వెళ్ళి, ఆ తర్వాత చేలోకి వెళ్ళి, అక్కణ్ణుంచీ తిరిగొచ్చేసరికి ఎంత లేదన్నా ఒక్క గంట పడుతుంది. వెళ్ళిందీ ఇప్పుడేగా?"

''ఆవిడమాటో?'' మనస్సు తిరిగి ప్రశ్నించింది.

''హిః ఆడది ఏంజేస్తుంది? ఏడ్చి వూరుకుంటుంది. నలుగురికీ తెలిస్తే పరువుపోతుందని నోరు నొక్కుకొంటుంది. ఎందరిళ్ళల్లో ఇట్లాటి సంగతులు గుట్టుగా జరగటంలేదూ?'' మనసు పీక నొక్కాడు మంగయ్య.

''ఎంతపనైతేమాత్రం వేళకు అన్నం తినాలనేది కూడా మర్చిపోయావా మావా?'' మహాలక్ష్మి, మంచంమీద కంబళి కప్పుకు అటుతిరిగి కూర్చున్నది భర్తే అనే భావంతో, అంది.

సమాధానం రాలేదు...

''అందుకే వచ్చాను... అన్నట్టు మంగ య్యేడీ?'' అన్నంబుట్ట, కిందకు దింపి, పక్కకువస్తూ అడిగింది మహాలక్ష్మి.

మరు నిముషంలో మంగయ్య కబంధహస్తాలు ఆమెను చుట్టుముట్టాయి.

ఒక్కసారి దిమ్మెరపోయి చూచింది మహాలక్ష్మి. అసలే గర్భవతి, అనుకోని సంఘటన. ఆయాసంతో, భయంతో, కోపంతో వణికిపోయింది క్షణకాలం.

''ఛీ... నీ జన్మ పాడుగాను. ఇదేం

బుద్ధిరా ఛండాలుడా. వదలిపెట్టరా చచ్చి నోడా."

అరుస్తున్న మహాలక్ష్మినోరు నొక్కేశాడు మంగయ్య.

పైన నింగీ, క్రింద నేలా, పక్కన భగభగమండుతున్న బట్టీ - మహాలక్ష్మి బతుకు బుగ్గిపా లయ్యింది.

కొప్పు వూడి, పొడుగుపాటి వెంట్రుకలు చిందరవందరగా వ్రేళ్ళాడుతున్నాయి. శరీరం కల్మశ భరితమై పోయింది. హృదయంలో భగ భగ మంటలు రేగుతున్నాయి.

''గుట్టుగా వూరుకో. అల్లరిచేస్తే నీకే మోసం!'' మంగయ్యమాటలు మరోసారి శూలాల్లా గుచ్చుకున్నాయి.

''ఊరుకోనురా, ఊరుకోను; నా శిగ ఊడదీశావ్; నీ పెళ్ళాంశిగ తరిగేరోజు లొచ్చాయ్. నా ఒళ్ళు పాడుచేశావ్, నీ ఇల్లు గుల్లకావటం చూస్తావ్. నన్ను నాశనం చేశావ్, నిన్ను నిలువునా... నిలువునా..." శివమెత్తిన గ్రామదేతలా చిందులు తొక్కుతోంది మహాలక్ష్మి!

"చాల్లే, అల్లరి చెయ్యకు...అదుగో దూరాన అన్నొస్తున్నాడు," అటువేపు చూచింది మహాలక్ష్మి. భర్త చేతులో బరిసెతో వస్తున్నాడు.

వెంటనే మండుతున్న చింత మొద్దు తీసింది...

"చావు పాపిష్టోడా.'' వెంటబడ్డ మహాలక్ష్మిని తప్పించుకోటానికి అడవిలోకి పరుగుతీశాడు మంగయ్య.

అర్ధంగాని తిరుపతయ్య భార్యను పట్టుకోపోయాడు. అవతల అడవిలో తన శత్రువు, మధ్య భర్త! ఇవతల తను.

ఈ పాడుశరీరం తనభర్త ముట్టుకో గూడదు...

"ఏమిటి మహాలక్ష్మీ,'' ఎలుగెత్తి అరుస్తూ దగ్గరికి వచ్చేశాడు తిరుపతయ్య.

"అక్కడే ఆగు మావా!!''

వెనక్కు నడుస్తూనే జరిగిం దంతా చెప్పింది మహాలక్ష్మి. ''మైలపడ్డ ఈ బతుకు నా కొద్దు... కానీ నా కసి చచ్చి సాధిస్తాను."

తిరుపతయ్య వాదించబోయేలోపలే మహాలక్ష్మి బట్టీమీద కెక్కింది. రెప్పపాటు కాలంలో లోపలికి దూకేసింది. క్షణంలో మహాలక్ష్మి రక్తమూ, మాంసమూ, ఆమె తియ్యని కలలకు రూపమైన పొట్టలోని పసికందూ కాలి, ఉడికి, దుర్భరమైన వాసన గుప్పున వచ్చింది.

కళ్ళు చింతనిప్పు లయ్యాయి. అడవిలో నక్కి కూర్చొనివున్నాడు మంగయ్య. బరిసె ఎత్తాడు తిరుపతయ్య.

మరదలు స్మృతిలో మెదిలింది. నిండుగా పుట్టిలా అమాయకంగా తిరిగే బంగారు?

"ఛీ......'' ముఖాన ఉమ్మి తిరిగి వచ్చాడు తిరుపతయ్య.

ఊరంతా పోగయ్యారు. బట్టీ ఆర్పారు. మహాలక్ష్మి మెళ్ళో నాను బంగారు ముద్దయి దొరికింది.

కానీ అందరూ చూస్తుండగానే, ఆర్పిన బట్టీలోనుంచి లేచిన మంట, అడవికేసి పరుగెత్తింది. అంతా దిగ్భ్రాంతి చెందారు.

మళ్ళీ వూరికేసి వెళ్ళటమూ చూశారు.

అంతే! రెండు కుటుంబాలు వేరుపడి పోయాయి.

ఎట్లాగో బిడ్డలను పెంచుకున్నాడు తిరుపతయ్య.

అడవిలోనుంచి తిరిగివచ్చిన మరుక్షణం మంచమెక్కాడు మంగయ్య. కళ్ళు తెరిచినా, మూసినా మహాలక్ష్మి జుట్టు విరబోసుకుని తలమీద మండుతున్న చింత మొద్దు పెట్టుక, "నిన్ను నిలువునా...నిన్ను నిలువునా..." అంటూ మంచంచుట్టూరా తిరుగుతున్నట్లు కన్పిస్తోంది.

"అదిగో వదిన..." ప్రతిక్షణమూ ఉలికిపడడమే. కడుపులో కాలుస్తున్న బాధ తలపగిలే పోటు, వెన్ను విరిగే నొప్పి, శరీరమంతా వాతలేస్తున్నట్లుబాధ.

"అమ్మో, అబ్బా," అన్న నోరు మూతపడలేదు మంగయ్యకు.

చావబోయి బ్రతికిన బంగారుకు మగపిల్లాడు పుట్టాడు. కానీ వాడికి కళ్ళూ, ముక్కూ చెవులూ ఏవీలేవు.

"దయ్యబ్బిడ్డ!"

బ్రతికుండగానే వాణ్ణి పూడ్చేశారు. అమ్మలక్కలు - ఉంటే అరిష్టమని.

వరుసగా ఆరు కాన్పులు కన్నది బంగారు.

ఏ ఒక్కబిడ్డా సవ్యంగా పుట్టలేదు.

తిరుపతయ్య పెద్దకొడుకు వ్యాపారంలో వేలు గడించాడు. మిగతా ఇద్దరూ కూడా, ఆర్జనపరులయ్యారు. మహాలక్ష్మి లేని లోటుతప్ప ఆ ఇల్లు కళకళ లాడుతూనే వుంది.

"అక్కా నేను నీ కేం చేశాను. నా మొగుడు చేసిన పాపిష్ఠి పనికి నన్ను చంపుతావా? నాబిడ్ల లేం చేశారు నిన్ను?"


సున్నపు బట్టీదగ్గర పడి దొర్లిదొర్లి ఏడ్చింది బంగారు ఏడవసారి; - మరి నాలుగు రోజుల్లో పురుడొస్తుందనగా.

ఈసారి మగపిల్లాడే; అన్ని అవయవాలూ వున్నాయి కానీ వాడు పుట్టిన పదిరోజులు తిరక్కముందే, 'తండ్రి కోసం పుట్టిన బిడ్డ' అనిపించుకున్నాడు.

పెరట్లోకి వెళ్ళిన మంగయ్యకు ఎదురుగా మండుతున్న శిగలతో మీదిమీదికి వస్తున్న మహాలక్ష్మి కన్పించింది.

అంతే, గావు కేకపెట్టి గుండె పగిలి చచ్చాడు మంగయ్య

దినదిన గండంతో పెరిగాడు బంగారు కొడుకు వెంకయ్య. ఎలాగో పెళ్ళి చేసింది బంగారమ్మ కొడుక్కు! కానీ మళ్లీ అదేవరస! తిరుపతయ్య మనవళ్ళతో మనవరాళ్ళతో ఆడుకుంటున్నాడు!




తనకోడలు నాలుగుమార్లూ కన్న బిడ్డలు నలుగురూ పురిట్లోనే పోయారు! తిరిగీ బట్టీదగ్గరికి వెళ్ళి ఏడ్చింది బంగారు.

ఐదోసారి పుట్టిన కోటయ్య బతికాడు.

కాస్త ఊహ తెలిసింతర్వాత, బంగారమ్మ, మనవణ్ణి దగ్గర కూర్చోబెట్టుకుని, తాతయ్య చేసిన ఘనకార్యం విడమరచి చెప్పింది. గుర్తుగా ఇంటి చుట్టూ రాత్రిళ్ళు తిరిగే వెలుగును చూపింది.

కోటయ్య – గుణానికీ, పోలికలకూ కూడా పెద్ద తాతయ్యలాటివాడు. అసలు తాత ఆకారమూ, పెద్దతాత గుణమూ వచ్చాయతడికి. పెరిగేకొద్దీ కోటయ్యనందరూ! 'తిరుపతయ్యా' అనటం మొదలెట్టారుకూడా. బంగారమ్మకూడా చనిపోయింది!

"పెద్దవ్వా! మా తాతయ్య చేసిన వెధవపనికి నేను నీకాళ్ళమీద పడతాను! పెద్దవ్వా! నీ బిడ్డలూ, నీవాళ్లూ లక్షణంగా వున్నారుకదా? ఇంకా మామీద వైరమెందుకు పెద్దవ్వా?

"పంటల్లేవు! అప్పులు! దరిద్రం, జబ్బులు! ఇన్నిటితో మమ్మల్ని హింసపెడుతూకూడా ఇంకా మాఇంటి చుట్టూరా తిరుగుతున్నావా? నన్ను చంపాలనుకుంటున్నావా? కానియ్యి. అంతటితో నీ పగ చల్లారేట్టయితే ఇప్పుడే ఇక్కడే చంపెయ్యి నన్ను. ఇక ఊళ్ళోకి అడుగెట్టొద్దు...జనమెట్లా భయపడుతున్నారో చూశావా? వాళ్లేం చేశారు నిన్ను? నన్ను చంపి నీ వైరం తీర్చుకుని ఇక ఈ పొలిమేర దాటి వూళ్లోకి రావొద్దు... సరా?"

కోటయ్య బట్టీదగ్గర అట్లాగే పడుకున్నాడా రాత్రంతా. ఆ వెలుగా తని పక్కకు వచ్చింది. కించిత్తు సెగకూడా వెయ్యలేదతనికి. పైగా ఎవరో శరీరమంతా వాత్సల్యపూరితంగా నిమిరిన

ట్లనుభూతి చెందాడు.

మర్నాడు ఊరిపొలిమేర దాటి రాలేదా వెగులు.

మరి కోటయ్యకి కే కష్టాలూ కలుగ లేదు. పంటలు తిరిగీ పండాయి. బాకీలు తీరాయి. నిలదొక్కుకుని, కుటుంబంలో నలుగురూ కూడారు. పిల్లా, జెల్లా, పశువులూ.

కానీ తనను తప్పించుకుపోయిన మంగయ్య అడవిలో దాక్కున్నాడు. ఆ అడవి మీద ఆవిడ కేమిటో కసి. కసిగా తెల్లవార్లూ అలా అడవిలోకీ బట్టీదగ్గరకూ తిరుగుతూనే వుంటుంది. ఎవర్నేమీ చెయ్యదు... ఎవ్వరికీ హాని తలపెట్టదు... మహాలక్ష్మి నీనాడూ దేవతలానే కొలుచుకుంటున్నారు...

బట్టీ చుట్టూరా, చుట్టుప్రక్కలగ్రామ ప్రజలు బిడ్డలక్షేమంకోసం, బిడ్డలకోసం, మొక్కుతూ తిరిగిపోతుంటారు పగలు.

* * *

''ఒక్కటి మాత్రం బాధ బాబూ! ఇంకా ఎన్నేళ్ళు ఆ జీవాత్మ పాపం అట్లా వానకు గాలికి కొట్టుకులాడాలో! ఎంతైనా కడుపులో బిడ్డను చంపిన దోషం ఆమెకూ అంటుకుంది గదు బాబూ! అది పరిష్కార మయ్యేవరకూ ఆట్టా కొట్టుకులాడు తుండాల్సిందే గావాలు మా పెద్దవ్వ.'' అన్నాడు కోటయ్య కథ ముగిస్తూ.

శరీరమంతా రోమాంచిత మయింది.

మేడమీద నిల్చుంటే దూరంగా మినుకుమినుకుమంటూ చరచర తిరుగుతున్న వెలుగు స్పష్టంగా కన్పిస్తోంది.

''వస్తాను బాబూ!'' కోటయ్య వెళ్ళిపోయాడు.

''అదేమిట్రోయ్ అలా కొయ్యబారిపోయావ్? కొంపదీసి భయపడ్డావేమిటి వింటూ?'' అన్నాడు శేఖర్ నన్ను కుదుపుతూ.

''ఆ! నిజంగా నే భయమేసిందిరా శేఖర్. ఈ కథ ముందుగా తెలిసివుంటే, నే నారోజు అడవిలో అడుగుకూడా పెట్టేవాణ్ణికాదు.'' అన్నాను గడ్డకట్టిన శరీరాన్నీ, మనసునూ మామూలుస్థితిలోకి తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ.

''సర్లే. ఇప్పుడు చెప్పరా శేఖర్, భాస్వరం...''

''లేదు లేదు...''

మర్నాడు బండిలో శేఖర్‌తోబాటు బయల్దేరాను.

సుస్నపు బట్టీ నిటారుగా నిల్చుని తనలో ఎంతో బాధనూ, గాధనూ దాచుకుని వున్న ట్లనిపించింది నాకు.

లలిత కంతా చెప్పాను.

''నమ్మలేకుండా వున్నాను,'' అంది బిక్కు బిక్కుమని చూస్తూ.

''నిజమే మరి. ఈ వైజ్ఞానిక యుగములోకూడా ఇలాటివి కొన్ని నమ్మలేని నిజా లున్నాయ్.'' అన్నాను లలిత భయం తీర్చే ప్రయత్నంతో. ★